క్లుప్తంగా

నంది, గరుడ వాహనాలు సిద్ధం



మండపేటలో రూపుదిద్దుకున్న నంది, గరుడ వాహనాలు

కపిలేశ్వరపురం (మండపేట): రావులపాలెం మండలం కొమరాజులంకలోని శ్రీపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీజనార్దన స్వామివార్ల ఆలయాలకు అదే గ్రామానికి చెందిన సత్తి భాస్కరరెడ్డి, నాగమణి దంపతులు రూ.5 లక్షలతో ఇత్తడి నంది వాహనం, గరుడ వాహనం ప్రతిమలను చేయించారు. వాటిని మండపేటకు చెందిన లోహ శిల్పి వాసా శ్రీనివాస్ తయారు చేశారు. ఆదివారం మండపేట నుంచి కొమరాజులంకకు ప్రతిమలను తరలించారు.

టమాటా రైతులను ఆదుకోవాలి

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో టమాటా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్, మండపేటకు చెందిన కామన ప్రభాకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులతో కలిసి అన్నమయ్య జిల్లా మదనపల్లి తదితర ప్రాంతాల టమాటా రైతులను కామన పరామర్శించారు. టమాటా సాగు, మార్కెట్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు కామన తెలిపారు.

వృద్ధులకు అన్నదానం



కొండగుంటూరులో అన్నదానాన్ని ప్రారంభించిన వీర్రాజు, వెంకన్నబాబు

కపిలేశ్వరపురం (మండపేట): రాజానగరం మండలం కొండగుంటూరు పాకలు వద్ద మదర్ థెరిస్సా శ్రీలక్ష్మీ కృష్ణా బృందావనంలో కేశవరానికి చెందిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ అబ్బిరెడ్డి వీర్రాజు ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు చేతుల మీదుగా అన్నదానాన్ని ప్రారంభించారు. రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్టు అబ్బిరెడ్డి వీర్రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూలం నాని, తుపాకుల ప్రసన్నకుమార్, బందెల సాయిరామ్ పాల్గొన్నారు.

మండపేట మున్సిపాలిటీకి ఉత్తమ సేవా పురస్కారం

కపిలేశ్వరపురం (మండపేట): స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర పథకంలో భాగంగా జిల్లాలో 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు మండపేట మున్సిపాలిటీ అవార్డునకు ఎంపికైంది. ప్రభుత్వం అందజేయనున్న ఈ పురస్కారాన్ని సోమవారం అమలాపురంలో కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అందుకోనున్నారు. ఆయనతో పాటు ఉత్తమ సేవలందించినందుకు పారిశుధ్య కార్మికులు బొట్టా సూరిబాబు, వడ్డాది దుర్గారావు పురస్కారం అందుకోనున్నట్టు మున్సిపల్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానం

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడిలో ఆదివారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవాలు ముగింపు నేపథ్యంలో కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంతో పాటు కపిలేశ్వరపురం, సూర్యాపేట తదితర గ్రామాల భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

గ్రామాల్లో అన్నసమారాధన

కాజులూరు: గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట, ఊడావారిపేటలో గ్రామస్తులు ఆదివారం అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో గత నెల 22న సోమవారం నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ దేవీ నవరాత్ర మహోత్సవాలు కొనసాగాయి. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

పీహెచ్‌సీల్లో దంత వైద్యులు లేక అవస్థ

కాజులూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం దంత వైద్యులను నియమించాలని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ డిమాండ్ చేసారు. ఆదివారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా నాడు-నేడు పథకం ద్వారా విద్యా, వైద్యాలయాలు ఎంతగానో పురోగతి సాధించాయన్నారు. ఇటీవల ప్రజల్లో దంత సమస్యలు అధికమయ్యాయని పీహెచ్‌సీల్లో వైద్యులు లేక రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకుంటున్నారన్నారు. గొల్లపాలెం, దుగ్గుదుర్రు పీహెచ్‌సీల్లో ఒక చోట అయినా దంత వైద్యులను నియమించి రోగులకు వైద్యసేవలందించాలని కోరారు.

నాడు వేగవంతం..నేడు జాప్యం

- అటకెక్కిన పాఠశాలల అభివృద్ధి పనులు
- విద్యారంగంపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం
- సౌకర్యాల కొరతతో విద్యార్థులకు ఇబ్బందులు



రామచంద్రపురం మండలం నరసాపురపుపేటలో నాడు- నేడు పనుల ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాల



కాజులూరు మండలం గొల్లపాలెం పంచాయతీ పరిధిలో ధనలక్ష్మిపేటలో అసంపూర్తిగా నాడు - నేడు పనులు

రామచంద్రపురం: ప్రభుత్వ పాఠశాలలు, వాటిల్లో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది. పాఠశాలల పురోభివృద్ధిపై నిర్లక్ష్యపు నీడ కమ్ముకుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. ×మన బడి నాడు - నేడు• పథకంలో మొదటి విడత కొన్ని పాఠశాలలు, రెండవ విడత మిగిలిన పాఠశాలలు ఆధునీకరణకు, అదనపు తరగతి గదులు, టాయ్‌లెట్ల నిర్మాణానికి, ఆర్వో ప్లాంట్, విద్యుత్ సౌకర్యం, గార్డెన్, క్రీడా స్థలం తదితర సౌకర్యాల కల్పనకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి విడుదల చేసింది. మొదటి విడత పాఠశాలల పనులు గత ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. రెండవ విడత పనులకు కూడా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా చాలా వరకు పనులు పూర్తి కాగా సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో అవి అసంపూర్తిగా నిలిచిపోయాయి. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పాఠశాలలను పట్టించుకోకుండా, అసంపూర్తిగా మిగిలిపోయిన అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

రామచంద్రపురం నియోజకవర్గంలో మొత్తం పాఠశాలలు కె.గంగవరం మండలంలో 76, రామచంద్రపురం రూరల్, అర్బన్ 86, కాజులూరు మండలంలో 79 ఉన్నాయి. మొత్తం ఉపాధ్యాయులు కె.గంగవరం మండలంలో 265, విద్యార్థులు 5,642 మంది, రామచంద్రపురం రూరల్ అర్బన్ 364, విద్యార్థులు 7,995 మంది, కాజులూరు మండలంలో 278, విద్యార్థులు 7,768 మంది ఉన్నారు. నాడు - నేడు ద్వారా ఆధునీకరించిన ఫేజ్ 1,2లో కె.గంగవరం 49 పాఠశాలకు రూ.14.20 కోట్లు, రామచంద్రపురం రూరల్, అర్బన్ 65 పాఠశాలలకు రూ.10.32 కోట్లు, కాజులూరు మండలంలో 72 పాఠశాలలకు రూ.11.76 కోట్ల నిధులు మంజూరు చేయగా కొన్ని పాఠశాలలు పూర్తిస్థాయిలో పనులు పూర్తికాగా మరికొన్ని నిలిచిపోయాయి. వాటిని ప్రస్తుత ప్రభుత్వం అటకెక్కించింది. దీంతో నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి.

మండపేట నియోజకవర్గంలో....

కపిలేశ్వరపురం మండలంలో 37 ప్రాథమిక పాఠశాలల్లో 1,198 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆరు ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1,127 మంది, 8 ఉన్నత పాఠశాలల్లో 629 మంది మొత్తం 2,954 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. నాడు- నేడు ఫస్ట్ ఫేజ్‌లో 19 పాఠశాలలను రూ.3,65,92,000 నిధులతో మెరుగుపర్చారు. అన్ని పనులను గత ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. నాడు- నేడు రెండో ఫేజ్‌కు సంబంధించి కపిలేశ్వరపురం మండలంలో గత ప్రభుత్వం 32 పాఠశాలలను ఎంపిక చేసి పనులను ప్రారంభించింది. రూ.2,73,21,069 నిధులు మంజూరు చేసింది. రూ.2,1929,812 విడుదల చేయడంతో పనులు దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన రూ.53,91,257 ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14నెలలు గడుస్తున్నా విడుదల చేయలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పాఠశాల నిర్మాణం చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

హజరత్ మహబూబ్ సుభానీ గంధోత్సవం



మహబూబ్ సుభానీ జెండాతో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: వెలంపాలెంలో హజరత్ సయ్యద్ మహబూబ్ సుభానీ జెండా వద్ద మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫాజిల్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం గంధోత్సవం నిర్వహించారు. జెండాను చేతబూని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, కమిటీ కార్యదర్శి బాబూలాల్, షేక్ జమాల్ హుస్సేన్, షేక్ గౌస్, ఎండీ నౌషద్‌బాబు, షేక్ బాబ్జీ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పీఠాధిపతి గాడ్ సతీమణి సీతా మహాలక్ష్మి జయంతిని పురస్కరించుకుని గాడ్ కుమార్తెలు సత్యవెంకట కామేశ్వరి ఆధ్వర్యంలో సీతా మహాలక్ష్మి విగ్రహానికి భక్తులు పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పేదలకు చీరలు పంపిణీ చేసి, అన్నసమారాధన నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, బుజ్జి,, పీఆర్వో బాబి, విజయదుర్గా సేవా సమితి ప్రతి నిధులు గాదే భాస్కర నారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త పారబోత



యానాం, ద్వారపూడి రహదారిలో కోలంక వద్ద రోడ్లపై పేరుకుపోయిన చెత్త

కాజులూరు: యానాం, ద్వారపూడి రహదారిలో మండలంలోని కోలంక వద్ద రోడ్లపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ఏ ఒక్క ప్రాంతంలో డంపింగ్ యార్డు సదుపాయం లేకపోవడంతో గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది, స్థానికులు గృహావాసాల్లోన్ని చెత్తా చెదారం గ్రామ ముఖ ద్వారంలోని రోడ్డు పక్కలన పారవేస్తున్నారు. పశువులు, కుక్కలు, కోళ్ల సంచారంతో రోడ్డు పక్కన పారవేసిన చెత్తకుప్పలు చెల్లాచెదురై రోడ్లపైకి వస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డుపై చేరిన చెత్త కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. దానికి తోడు గ్రామస్తులు కొందరు రాత్రి సమయంలో రహదారులకు ఇరువైపులా కాలకృత్యాలు తీర్చుకోవడంతో అపరిశుభ్రత నెలకొందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భవిత కేంద్రం సేవలకు ఆటంకం



దివ్యాంగులకు చికిత్స అందించే గదిలో విధులు నిర్వహిస్తున్న ఎంఈఓ కార్యాలయ సిబ్బంది



ఆరుబయట వరండాలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

రామచంద్రపురం రూరల్: దివ్యాంగులైన చిన్నారుల భవిష్యత్తుకు బాసట నిలిచేందుకు వారికి విద్యాబుద్ధులు నేర్పుతూ అవసరమైన వైద్య సదుపాయాలు అందించేందుకు ప్రతి మండలంలోనూ ఒక భవిత కేంద్రం పనిచేస్తుంది. రామచంద్రపురంలో భవిత కేంద్రం ఎంఈఓ కార్యాలయ భవనంలో కింద భాగంలో ఉంది. పైన ఎంఈఓ కార్యాలయం, సిబ్బంది కోసం ఒక గది, సమావేశాలకు హాలు ఉన్నాయి. కింద దివ్యాంగ చిన్నారులకు పాఠశాల నిర్వహణకు ఒక హాలు, వారికి ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటి వైద్య సేవలు అందించేందుకు ఒక గది ఉన్నాయి. మహిళలకు కుట్టు శిక్షణకు ఎంఈఓ కార్యాలయంలోని సమావేశపు హాలును ఈ ఏడాది ఏప్రిల్‌లో కేటాయించారు. ఎంఈఓ కార్యాలయం గది, సిబ్బంది గది రెండూ వారి ఆధీనంలోనే ఉన్నాయి. అయినప్పటికీ ఎంఈఓ కార్యాలయ సిబ్బంది కింద ఉన్న భవిత కేంద్రంలోని గదిలోకి వచ్చి తిష్ట వేశారు. చేసేదేమీ లేక భవిత కేంద్ర నిర్వాహకులు దివ్యాంగులకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీని ఆరుబయట వరండాలో అందిస్తున్నారు. విధి వంచితులైన చిన్నారులకు బాసటగా నిలవాల్సింది పోయి వారికి ఇబ్బందులు సృష్టించే విధంగా చర్యలు తీసుకోవడం మానుకుని వారిపై కనికరం చూపించాలని పలువురు కోరుతున్నారు. ఎంఈఓ కార్యాలయాన్ని పూర్తి స్థాయిలో పై అంతస్తులోకి మార్పించి దివ్యాంగ చిన్నారులకు ఇబ్బందులు తొలగించేందుకు మంత్రి సుభాష్ చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

దివ్యాంగులకు ఇబ్బంది కలిగించొద్దు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భవిత కేంద్రంలోని చిన్నారులను ఖాళీ చేయించి తన కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు అప్పటి డీఎల్‌డీఓ ఎ.శాంతి ప్రయత్నించారు.ఈ విషయం అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లినప్పుడు డీఎల్‌డీఓను ఆయన మందలించి దివ్యాంగులను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ప్రస్తుత మంత్రి సుభాష్ ఎక్కడా స్థలం లేనట్టు ఎంఈఓ కార్యాలయంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయించడం సమంజసం కాదు. ఎంఈఓ కార్యాలయాన్ని పూర్తిగా పై అంతస్తుకు మార్పించి, దివ్యాంగులైన చిన్నారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలి.

-నరాల రాజ్యలక్ష్మి,
వైస్ ఎంపీపీ, రామచంద్రపురం మండలం

ప్రజలను చైతన్యవంతం చేయాలి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా విజయ దశమి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగం కార్యదర్శి పి.వీరభద్రరాజు మాట్లాడుతూ ప్రతి హిందూ కుటుంబం నుంచి ఒక ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ తయారు కావాలని పిలుపు ఇచ్చారు. ప్రతి గ్రామంలో ఆర్ఎస్ఎస్ శాఖ ఏర్పడి అన్ని వర్గాల ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దూడల శంకరనారాయణ, నాయకులు యాళ్ల బుజ్జి, ఆళ్ల లక్ష్మీనారాయణ, బీవీఎల్ నారాయణ మాస్టారు, తోట రామకృష్ణ, శాకా బాల సుబ్రహ్మణ్యం, స్వయం సేవకులు పాల్గొన్నారు.



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో మాట్లాడుతున్న వీరభద్రరాజు

పెండింగ్ బకాయిల సమస్య పరిష్కరించాలి

రావులపాలెం: పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు, ఐఆర్ ప్రకటన, సరెండర్ లీవ్స్ బిల్లు చెల్లింపు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో కొత్తపేట తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. స్థానిక మండల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఏపీ ఎన్జీవో కొత్తపేట తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు మోటూరి రామారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు, జిల్లా ఉద్యోగుల సంఘం సమన్వయకర్త మాధవరపు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఏ బకాయిలు, సరెండర్ లీవుల బకాయిలు, పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు ఐఆర్ ప్రకటన తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే కోనసీమ జిల్లా సంఘ కార్యకలాపాలను విస్తరణ చేయడంలో భాగంగా జిల్లా అడహాక్ కమిటీ ఏర్పాటు ఈనెల 9న జరగనున్నట్టు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకత్వం వస్తుందన్నారు. సమావేశంలో కొత్తపేట ఏపీఎన్జీవో మాజీ అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి నల్ల రామారావు, సహా అధ్యక్షుడు ఏపుగంటి సురేష్, కోశాధికారి శామ్యూల్ రాజు, సభ్యులు చంద్రశేఖర్, ఏఎన్ఎం అనసూయ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సభ్యుల నినాదాలు

'భక్తి' జ్ఞాన జ్యోతిని వెలిగించాలి

అయినవిల్లి: అజ్ఞానాన్ని తొలగించి భక్తి అనే జ్ఞాన జ్యోతిని ప్రతి ఒక్కరిలో వెలిగించాలని, అది ఆదిదేవుడు శ్రీకృష్ణుని ఆశ్రయించడం వల్లే సాధ్యపడుతోందని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు ప్రభూజీ సుందర శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నల్లచెరువు గ్రామంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ ప్రభూజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ, శ్రీకృష్ణుడు విశ్వాంతర్యామి అన్నారు. ఆధ్యాత్మిక విద్యతోనే నిరంతరం తరించాలన్నారు. అప్పుడే శాంతి లభిస్తుందన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ప్రసాదానికి విరాళం

గ్రామానికి చెందిన నేదునూరు పీఏసీఎస్ చైర్మన్ వర్రే శ్రీనివాసరావు, గంగాభవాని మనవరాలు మేడిశెట్టి శ్రీయాన్షి పుట్టినరోజు సందర్భంగా రూ.5116లు విరాళం అందజేశారు. ఈ సొమ్మును ప్రభూజీ సుందర శ్రీనివాస్‌కు అందజేశారు. దాతను ఆలయ నిర్వాహకులు, భక్తులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

మామిడికుదురు: ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని అడిషనల్ డీపీఎం సత్యనారాయణ తెలిపారు. ఆయన ఈదరాడలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన పంటలను ఆదివారం పరిశీలించారు. పంచగవ్య స్ప్రేయింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో 25 లీటర్ల పంచగవ్య స్ప్రేయింగ్ చేయాలన్నారు. దీని వల్ల గింజ గట్టిపడ్డి దిగుబడి గణనీయంగా పెరుగుతుందన్నారు. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. రైతులు ప్రకృతి సాగు విధానంలో పంటలు పండించాలన్నారు. కార్యక్రమంలో రైతులు యెరుబండి లక్ష్మయ్య, యెరుబండి ఫణిరామ్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కుడుపూడి జానకి, చెల్లుబోయిన రాధ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి

మామిడికుదురు: సొసైటీలు రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పాశర్లపూడి సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. చైర్మన్‌గా మంద గాంధీ, డైరెక్టర్లుగా బొంతు మహాలక్ష్మి నాగకుమారి, యర్రంశెట్టి దుర్గా రాజేశ్వరి ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీలు సకాలంలో ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు రైతులకు అందించి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, నేతలు జాలెం శ్రీనివాసరాజు, కొనుకు నానగరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వచన కవితల పోటీలు

అంబాజీపేట: పట్టణంలోని అరిగెల బలరామమూర్తి సాహితీ కళా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే వచన కవితల పోటీలను కవులు సద్వినియోగం చేసుకోవాలని సాహితీ కళా పీఠం అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి కోరారు. అంబాజీపేట బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సాహిత్య కళా వేదిక కార్యాలయంలో తృతీయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. బలరామమూర్తి మాట్లాడుతూ, కళా పోషణలో భాగంగా కవులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఏటా సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో వచన కవితల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కవితల పోటీల్లో రహదారి భద్రత- ప్రమాదాల నివారణ అంశానికి సంబంధించి 25 పంక్తులకు మించకుండా కవిత రాసి పంపాలన్నారు. కవితలు తమ సొంత రచన అని, దేనికి అనువాదం, కాపీ కాదని హామీ పత్రం జత చేయాలన్నారు. కవితలను ఆహ్వాన కమిటీ, అరిగెల బలరామమూర్తి సాహితీ కళా పీఠం, బస్ స్టేషన్ ఎదురుగా, అంబాజీపేట.. అనే చిరునామాకు పోస్టల్ లేదా స్వయంగా అందజేయాలని తెలిపారు. కవితల స్వీకరణ చివరి తేదీ అక్టోబర్ 31తో ముగుస్తుందని, ఎంపిక చేసిన కవితకు రూ.5,116లు నగదుతో పాటు, మెమెంటో, కవి సత్కారం జరుగుతుందని తెలిపారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

అమలాపురం రూరల్: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం కృషి చేయడం ద్వారా అత్యుత్తమైన సమాజాన్ని తద్వారా శక్తివంతమైన దేశాన్ని నిర్మించగలమని తులసి సీడ్స్ అధినేత తులసీ రామచంద్ర ప్రభు ఉద్బోధించారు. అమలాపురం సత్యనారాయణ గార్డెన్స్‌లో ఆదివారం కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపకార వేతన పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా విద్యార్థులకు రూ.22 కోట్లు ఉపకార వేతనాలను పంపిణీ చేశామని తెలిపారు. కోనసీమ జిల్లాలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, వైద్య విద్యలో ప్రతిభ కనపరిచిన 650 మంది విద్యార్థులకు ఆయన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. గతేడాది 10వ తరగతిలో పరీక్షల్లో 596 మార్కులు సాధించిన పెద్దిరెడ్డి మోహనకృష్ణ సాత్విక్‌కు హైదరాబాద్ అలివ్ స్వీట్స్ అధినేత అలివ్ దొర రాజు రూ. లక్ష నగదు పురస్కారాన్ని అందించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం మాట్లాడుతూ చిన్నారులు ఉన్నత విద్యనభ్యసించి సమాజానికి అద్భుతమైన వనరులుగా తయారు కావాలన్నారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ రూ.50 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేసిన కాత్వా సభ్యులను అభినందించారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న తులసీ రామచంద్ర ప్రభు, కాత్వా ప్రతినిధులు

చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, బండిగుప్తాపు పాండురంగ తదితరులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిట్నీడి నిరంజన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు తాడి నరసింహారావు, రవణం స్వామినాయుడు, ఆకుల రామకృష్ణ, కాత్వా వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లా నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్ బాబు, కోనసీమ అధ్యక్షుడు మేడిచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి గండ్రోతు నాగేశ్వరరావు, దంగడమే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు అదరహో

- అలరించిన అమలాపురం శ్రీదేవి దసరా భారీ ఊరేగింపు
- 150 మంది కళాకారులతో ప్రదర్శనలు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలో ఆదివారం నిర్వహించిన అమ్మవారి నిమజ్జన ఊరేగింపును పుర వీధుల్లో వైభవంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పది రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలకు విశేషంగా ఆకట్టుకున్నాయి. దాదాపు 150 మంది కళాకారులు ఈ సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నారు. అన్ని ప్రదర్శనలు అదరహో రీతిలో సాగాయి. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన 40 మంది కళాకారులతో భూత, భేతాళ సెట్ ప్రదర్శన ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంప్రదాయ గిరిజన కొమ్ము కోయ బృందం (థింసా నృత్యం), విజయవాడకు చెందిన 13 మంది కళాకారులతో కాళి నృత్య ప్రదర్శన, గరగ నృత్యాలు, బుట్ట బొమ్మలు, కర్ర బొమ్మలు, కోతి డ్యాన్స్, 20 మంది కళాకారులతో జానపద డప్పుల నృత్యం, సినీ మ్యూజికల్ బ్యాండ్‌లు, వాహన ఫ్లవర్ డెకరేషన్ ఈవెంట్ ఇలా పలు ప్రదర్శనలు ప్రజల్లో వినోదాన్ని నింపుతూ ఊరేగింపు సాగింది. ముఖ్యంగా నరసింహావతారంతో రాక్షసుడిని సంహరిస్తున్న ప్రదర్శన చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. యువత కేరింతల మధ్య భారీ ఊరేగింపు ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు, కమిటీ ప్రతినిధులైన మాజీ కౌన్సిలర్లు ఆశెట్టి ఆదిబాబు, మామిడిపల్లి రాంబాబు, జీవీ తదితరులు పర్యవేక్షించారు. తొలుత శ్రీదేవి అమ్మ ఆలయం వద్ద నుంచి మొదలైన ఊరేగింపు ముస్లిం వీధి, హైస్కూలు రోడ్డు సెంటరు, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, అశోక్‌నగర్ తదితర వీధుల్లో సాగింది. ఆదివారం సాయంత్రం నుంచి మొదలైన ఊరేగింపు సోమవారం తెల్లవారు జాము వరకూ నిర్విరామంగా సాగింది.



భూత, బేతాళ, శక్తి వేషాల ప్రదర్శన



నరసింహావతారంతో రాక్షస సంహారం



ఊరేగింపులో వినోదాన్ని పంచిన గిరిజన థింసా నృత్యం



అమలాపురంలో హోరెత్తిన శ్రీదేవి అమ్మవారి దసరా ఊరేగింపు